# నోరులేనివాళ్ళు

నవంబరు మాసం. పొలాలమీద నుంచి చల్లగాలి వీస్తోంది. నలువైపుల్నుంచి చిరుచీకట్లు క్రమ్ముకొస్తోన్నాయి.

రాందాసు ఊరి రచ్చబండకేసి బయలుదేరాడు. అడుగులు నీరసంగా, మెల్లగా పడుతున్నాయి.

పాత తెల్లమల్లుపంచె - భుజంమీద తెల్ల ఉత్తరీయం - పూర్తిగా తెల్లబడిపోయిన బవిరిగడ్డం బక్కచిక్కిన శరీరం - ఎముకలు బయటపడ్డ బోర.

పొలంనుంచి ఊళ్లోకి తిరిగి వస్తోన్న ముసలి తెల్ల ఆవులా వున్నాడు.

ఆయన వెళ్లేసరికి రచ్చబండ మీద ఆ ఊరిపెద్దలు సభతీర్చి వున్నారు. అందరికీ గౌరవంగ పేరుపేరునా దణ్ణాలు పెట్టాడు గొంతు సవరించుకొని మెల్లగా.

"అయ్యా! ధనుర్మాసం వస్తోంది. ఊరిపెద్దలు మీరంతా తలా ఒక చెయ్యి వేసి మన ఊరి రామాలయాన్ని బాగుజేయిస్తే......" అని ఆగిపోయాడు.

పెద్దకాపు - "ఏందయ్యా పంతులూ! ఈ రాందాసు ఏంటంటాడు?" విసుగ్గా అన్నాడు.

మాజీ కరణం అప్పన్న పంతులు ఎగతాళిగా, "ఆఁ ఇప్పుడు కొత్తగా అనేదేముంది? ఎప్పుడూ అనేదేగా ఊళ్లో వాళ్లంతా చందాలేసుకొని పాడుబడ్డ ఆ రామాలయాన్ని బాగుజేయించి, మళ్ళీ పూజలూ పునస్కారాలూ చేయిస్తే ఆ శ్రీరామచంద్రుడు సంతోషిస్తాడు. మనల్ని అందర్నీ చల్లగా చూస్తాడు - అంటాడు!" అన్నాడు.

మాటల్లోని ఎగతాళినికాక, ఎదుటి మనిషిలోని మంచితనాన్ని మాత్రమే చూడగలిగిన రాందాసు సంభ్రమంగా, "చిత్తం, చిత్తం! శిథిలావస్థలో వున్న శ్రీరాములవారి ఆలయాన్ని ఉద్ధరిస్తే, మన ఊరికి రామాపురమనే పేరున్నందులకు సార్థకమౌతుంది!" అన్నాడు.

పెద్దరెడ్డి, "గుడిపేర్న ఏదో పొలం వుండాలికదా పంతులు?" అన్నాడు.

పంతులు నీళ్లు నములుతూ, "ఆ గుడి చుట్టూ వుంది ఆ గుడి పొలమే నండయ్యా!" అన్నాడు.

"మరింకేం ఆ పొలం మీద వచ్చే ఆదాయంతో ఆ పనేదో చేయించవచ్చుగా?" అన్నాడు మళ్ళీ.

పంతులు పెద్ద చౌదరివంకా, పెద్దకాపు వంకా చూస్తూ గుటకలు మింగాడు. వాళ్ళిద్దరూ గిల్టీగా తలా ఒక దిక్కు చూశారు.

నిజానికి ఆ గుడి పేర్న కొంత పొలం వుంది. రాందాసు తాతగారి హయాంలో పక్క ఊరి జమిందారుగారు ఆ పొలాన్ని రాములోరి గుడికి పట్టా రాపించి ఇచ్చారు. గుడి పొలానికి మూడు వైపులా ఆ ముగ్గురి పొలాలూ వున్నాయి. ఆ మధ్య వాళ్ళ పొలాలకు కబంధహస్తాలు మొలుచుకు వచ్చాయి. కాస్త కాస్త గుడి పొలాన్ని కబళించేసి తమలో కలిపేసుకున్నాయి. ప్రస్తుతం ఆ గుడి చెట్టూ ఒక పెద్ద దడి మాత్రం మిగిలి వుంది. ఆ దడిలోపలే రాందాసు పూరిగుడిసె వుంది.

ముందుగా పెద్దకాపే కాసుకున్నాడు గంభీరంగా, "ముందు మన ఊరికి ఒక గ్రంథాలయం కావాలి. మేమంతా దానికోసమే పెయత్నం సేస్తోన్నాం! ఇప్పుడు గుడికేం తొందరవచ్చింది? తర్వాత చూద్దాం లేవయ్యా రాందాసా! బాగా సీకటడ్డది ఇక నీవ్వెళ్లిరా!" అన్నాడు.

మిగతావాళ్లు అవునవును అవి తాళం వేశారు. రాందాసుకు మళ్లీ ఆశాభంగమే అయింది!

కాళ్లీడ్చుకుంటూ తిరుగుముఖం పట్టాడు.

దార్లో యువజన కేంద్రం కనిపించింది. యువకులన్నా నడుం కడతారేమోనన్న ఆశతో వాళ్ల దగ్గరకెళ్ళి మొరపెట్టుకున్నాడు. వాళ్లంతా వాళ్ల అభిమాన సినిమా హీరో పుట్టిన రోజుకు ఆ మండలం నుంచి సైకిళ్ల మీద హైదరాబాదు కెళ్లాలని చర్చించుకుంటున్నారు.

వాళ్లెవరూ ఆయన మాట చెవిన వేసుకోలేదు.

ముఖం చిన్నబుచ్చుకొని వెనక్కి తిరిగాడు.

వచ్చేముందు రాములోరి గుడిలో తాను పెట్టిన సంధ్యాదీపం మిణుకు మిణుకుమంటూంది. 'రామయ్యా చూశావయ్యా! ఈ ఊరోళ్ల తంతు!' అని దీర్ఘంగా నిట్టూర్చాడు.

తాను రావటం చూసి గుడిసెలోంచి తన కొడుకు బయటికి వచ్చాడు. అతడొక వెర్రిబాగులోడు ఉంటానికి పదారేళ్ళ వయస్సు వుంది. నోరూ వాయీ లేదు.

కుక్కి మంచంలో కూలబడ్డాడు.

తన నిస్సహాయ స్థితికి తనమీద తనకే కోపం వస్తోంది.... గతం గుర్తుకు వస్తోంది.......

చుట్టుపక్క గ్రామాల్లో తన తాతతండ్రులకు హరిదాసులుగా మంచి పేరు వుండేది. వాళ్ళు మనోహరమైన కంఠం ఎత్తి భజన్లు చేసి భక్తి పాటలు పాడితే సంక్రాంతి దినాల్లో ప్రజలు సంతోషించి కొంత ధాన్యం ఇచ్చేవాళ్లు. నడుం వంచి కష్టం చేస్తే ఈగుడి మడిచెక్క మిగతా ధాన్యం ఇచ్చేది. దాంతో సంవత్సరం పొడుగునా భుక్తికి లోటుండేది కాదు. ఇహ భక్తికి ఈ రాముడు వుండనే వున్నాడు!

ఎటొచ్చీ తాను పెద్దయ్యాకే కష్టాలన్నీ వచ్చాయి. రానరానూ ప్రజల్లో భక్తిభావం సన్నగిల్లి పోయింది. పేరుగానీ, లాభంగానీ లేందే ఏ పనీ చెయ్యరు. ఆ రెండూ కోసం ఏం పనైనా చేస్తారు.

ఊరి పెద్దల కుతంత్రాలకు గుడి మడిపోయి, దడి మిగిలింది. నోరుండి తానూ, నోరులేక ఆ రామయ్యా ఇదేం అన్యాయమని అడగలేక పోయారు! దానాదీనా తనకు భుక్తి గడవడం కష్టమై పోయింది.

గుడిశలో తన కన్నకొడుకూ - గుడిలో తనని కన్న తండ్రి ఆ రామయ్య తండ్రి, ఇద్దరి కిద్దరే. నోరూవాయీలేని వాళ్లు. నోరు తెరచి అడగలేరు. ఇద్దర్నీ తానే కాసుకోవాలి! తనకా ఓపిక

తగ్గిపోయింది. గుడి పాతపడి పోయింది. పూజలూ, పునస్కారాలు లేక రాముడు వెలాతెలాపోతున్నాడు. నైవేద్యాలు లేక ఇటుతానూ, అటు రాముడూ శుష్కించి పోతున్నారు.

* * *

ఆ రోజు ఊరంతా బహు సందడిగా వుంది. పెద్ద పండుగలాగా వుంది. ఎక్కడ చూసినా రంగు కాగితాల తోరణాలూ - కాషాయి జెండాలున్నూ! ఊళ్ళోని యువకులంతా పెద్ద ఊరేగింపుగా బయలుదేరారు. వాళ్లకు తోడుగా ఊరి పెద్దలు మేళతాళాలతో తర్లారు. ఆడవాళ్లు వాళ్లందరికి తిలకాలు దిద్దారు. హారతులు పట్టారు. మెళ్లొ దండలు వేశారు. దిన పత్రికలకు పంపటానికి ఫోటోలు దిగారు. జయజయ నినాదాలతో దిక్కులు పిక్కటిల్లాయి.

ఊరేగింపు ముందుకు నడుస్తోంది.

చందా డబ్బాలు మోగిస్తూ కొందరు కుర్రాళ్లు ముందు నడుస్తోన్నారు.

బియ్యం దుకాణానికి బయలుదేరిన రాందాసు ముందుకు పడదోసుకుంటూ వస్తోన్న ఊరేగింపును చూసి రోడ్డు పక్క నిలబడిపోయాడు.

చందా డబ్బా కుర్రాడొకడు 'ఛలో అయోధ్యా' అని అరుస్తూ రాందాసు దగ్గరికి వచ్చి చందా డబ్బాని ముఖం దగ్గర మోగించాడు. చిల్లర డబ్బులు వెయ్యబోయిన రాందాసు చేతిలోంచి అయిదు రూపాయల కాగితాన్ని గుంజుకొని డబ్బాలో వేసుకున్నాడు. బదులుగా ఒక ఫోటోని ఆయన చేతిలో పెట్టాడు.

దుమ్ము లేపుకుంటే ఊరేగింపు తనని దాటుకు పోయింది.

చేతిలోని ఫోటోవంక చూశాడు. విల్లు ఎక్కుపెట్టిన శ్రీరాముడి బొమ్మ. ఆ బొమ్మకింద, 'మందిరమచటే నిర్మిద్దాం - కరసేవకు కదలిరాండి!' అని రాసివుంది. దాని ఖరీదు ఐదు రూపాయలు.

రాందాసు గుడిలోని రాముడువైపు తిరిగి చిన్నగా నవ్వాడు. ఆయన కూడా లీలగా నవ్వినట్లనిపించింది.

- స్వాతి సపరివార పత్రిక

*15 అక్టోబరు 1993*

★